క్లుప్తంగా

18 నుంచి ప్రత్యేక డ్రైవ్

చిత్తూరు కార్పొరేషన్: భవన, ఇతర నిర్మాణ కార్మికుల నమోదుపై ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కార్మికశాఖాధికారి ఓంకార్‌రావు తెలిపారు. శుక్రవారం డ్వామా కార్యాలయంలోని సమావేశ మందిరంలో చిత్తూరు, గుడిపాల, యాదమరి మండలాల వలంటీర్లకు ఈ అంశంపై అవగాహన కల్పించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికులకు కార్మికశాఖ ద్వారా అందే సంక్షేమ పథకాలు పొందడానికి ఈ గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయన్నారు. ఏఎల్‌ఓ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

తమిళనాడు బియ్యం పట్టివేత

దొరవారిసత్రం: చెన్నై నుంచి ఆంధ్రకు తరలిస్తున్న తమిళనాడు రాష్ట్ర బియ్యాన్ని విజిలెన్స్, సివిల్‌సప్‌లై అధికారులు ఉమ్మడిగా దాడిచేసి స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం తల్లంపాడు గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సివిల్‌సప్‌లై డీటీ ఓబయ్య కథనం.. చెన్నై నుంచి ఆంధ్రకు మినీ వ్యాన్‌లో 52 గోను సంచుల్లో 2,550 కిలోల తమిళనాడు బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. బియ్యం విలువ రూ.76,500 ఉంటుందన్నారు. ఈ దాడుల్లో వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి


స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ షణ్మోహన్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్ అతిథిగా పాల్గొన్న స్వామివివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత పాజిటీవ్‌గా ఆలోచించాలని తెలిపారు. అప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలుగుతారని చెప్పారు. ప్రతి ఏటా జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. జిల్లా నెహ్రూ యువజన కేంద్రం కోఆర్డినేటర్ ప్రదీప్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ యువత స్వామి వివేకానంద మార్గంలో పయనించాలన్నారు. యువత 25 ఏళ్ల లోపు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని చెప్పారు. అనంతరం స్వామి వివేకానంద జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చాటి గెలుపొందిన విద్యార్థులకు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓలకు జ్ఞాపిక, సర్టిఫికెట్లను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఏఓ బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న డీపీటీవో చెంగల్‌రెడ్డి, ఓస్వ కమిటీ నేతలు

ఆర్టీసీ క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఆఫీస్ క్యాలెండర్ ఉందని డీపీటీవో చెంగల్‌రెడ్డి కితాబిచ్చారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఆఫీస్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓస్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కేహెచ్‌రెడ్డి, సీసీఎస్ డెలిగేట్ ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌వీ బాబు హాజరయ్యారు.

మార్కెట్‌లోకి ఎంజీ ఆస్టర్ నూతన కారు


కారును ఆవిష్కరిస్తున్న షోరూం నిర్వాహకులు

తిరుచానూరు(చంద్రగిరి): చెన్నై – బెంగళూరు రహదారి తిరుచానూరు సమీపంలోని కెశ్విన్ ఆటో మోటార్స్ షోరూంలో శుక్రవారం ఎంజీ ఆస్టర్–2024 కారును షోరూం అధినేత ఉదయ్ కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కారును తిరుపతి, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లోని తమ బ్రాంచీల్లో ఒకేసారి మార్కెట్‌లోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. వాహనం ప్రారంభ ధర రూ.9.98 లక్షలని తెలిపారు. ఇందులో ఏడీఏఎస్–ఎల్–2, 49 సేఫ్టీ, అతిపెద్ద సన్‌రూఫ్, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ చార్జింగ్ వంటి ఫీచర్లు ఉన్నట్టు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా కారు కొనుగోలుపై గోల్డ్ కాయిన్, రూ.2 లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుబ్రమణ్యం, నందాని బాషా, యూబీఐ చీఫ్ మేనేజర్లు శేషసాయి, రాకేష్ పాల్గొన్నారు.

పకడ్బందీగా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ


మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. చట్టప్రకారం లబ్ధిదారులకు భూ యాజమాన్య హక్కులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. తహసీల్దార్లు నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. అసైన్డ్ భూమికి ఆనుకుని వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు కేటాయించి ఉంటే వివరాలను నివేదికల్లో పొందుపర్చాలని తహసీల్దార్లను ఆదేశించారు. అసైన్డ్ చేసి 20 ఏళ్లు పూర్తయిన వాటిని 22ఏ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. జలవనరులు, పోరంబోకు, రస్తా భూముల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వీఆర్వోలు ప్రత్యేక చొరవతో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వెరిఫికేషన్ చేస్తామన్నారు. ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జేసీ తెలిపారు.

అన్నిదానాల్లో రక్తదానం మిన్న

- శిబిరాన్ని పరిశీలించిన డీఐఓ, ఆర్డీఓ

నగరి : అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సామాజిక సంకల్పం పేరిట నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నగరి, కుప్పం, పలమనేరులో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చాలా గొప్పదన్నారు. వలంటీర్లు పలువురిని ప్రోత్సహించడం, వారే ముందుకు వచ్చి రక్తదానం చేయడంతో శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ప్రతి యువకుడు, యువతి రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి, ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. మందులు మెడికల్ షాపులో దొరుగుతాయని, కొని వేసుకోవచ్చని, రక్తం అలాకాదన్నారు. అది ఒక మనిషి నుంచి తీసుకోవాల్సిందే అన్నారు. ఆర్డీఓ సుజన మాట్లాడుతూ మనం ఇచ్చే రక్తం ఒకొకరి ప్రాణాన్ని కాపాడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంజుల, ఆర్ఐ మేఘవర్ణం, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరన్నా అబద్ధాలు ఆపండన్నా!

- మీరు ఓడితే బెంగళూరు, గెలిస్తే విజయవాడలో..
- మా పంచాయతీలో అభివృద్ధే లేదని అబద్ధాలు చెబితే ఎలా?
- జీడిమాకులపల్లె పంచాయతీలోనే రూ.14.50 కోట్ల అభివృద్ధి
- మాజీమంత్రి అమర్‌పై జీడిమాకులపల్లె వైఎస్సార్‌సీపీ నేతలు ఫైర్

పలమనేరు/ గంగవరం: 'ఎన్నికలొస్తే గ్రామాల్లోకి రావడం.. అబద్ధాలను చెప్పడం ఆపై గెలిస్తే విజయవాడలో.. ఓడితే బెంగళూరులో ఉండే మీరు మా పంచాయతీలో అభివృద్ధి లేదనే మాట వెనక్కి తీసుకోవాలి.' అని గంగవరం మండలం జీడిమాకులపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఆ పంచాయతీ వైస్ సర్పంచ్ వాసుదేవరెడ్డి, నాయకులు రెడ్డెప్ప, శివారెడ్డి మాట్లాడుతూ గతంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచి, మళ్లీ మంత్రి పదవి కోసం టీడీపీలోకి వెళ్లినట్టు తామంతా పార్టీలు మారలేమన్నారు. అప్పుడేమో వైఎస్సార్‌సీపీ, ఇప్పుడేమో టీడీపీ, జనసేనలతో మూడుముక్కలాడుతున్నది తమరేనన్నారు. ఎక్కడ పరువుపోతుందోనని, మీ కారు డ్రైవర్ తండ్రి కర్ణాటక మద్యం కేసులో పట్టుబడితే జామీనిచ్చింది తామేనని గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రభుత్వంలో తమ పంచాయతీలో అభివృద్ధే లేదని చెప్పడం సరికాదన్నారు. ఈ నాలుగన్నరేళ్లలో తమ పంచాయతీలో వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ కలిపి మొత్తం రూ.14.50 కోట్లు వెచ్చించారన్నారు. ఈ వివరాలు తమ సచివాలయబోర్డుపై ఉన్నాయని, ఏదేనా అనుమానం ఉంటే చూసుకోవచ్చనన్నారు. నాటి టీడీపీలోలాగా 4 ట్రాక్టర్ల నీరు తోలి 40 ట్రాక్టర్లకు బిల్లులు తాము పెట్టుకోలేదన్నారు. మీ హయాంలో ఇక్కడ మూడు పక్కా ఇళ్లను మంజూరు చేస్తే జగనన్న పాలనలో 42 ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. గ్రామాల్లో ఓట్ల కోసం వచ్చి తప్పులు చెప్పి, జనం మధ్య గొడవలు పెట్టకుండా మీరు గెలిస్తే ప్రజలకు ఏమి మేలు చేస్తారో చెబితే చాలా సంతోషిస్తామని విన్నవించారు.



కండలేరు జలాల విడుదల



రాపూరు: నెల్లూరు, తిరుపతి జిల్లాలకు కండలేరు జలాలను విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా, రాపూరు మండలం, కండలేరు జలాశయం హెడ్‌రెగ్యులేటర్ సత్యసాయిగంగ కాలువ నుంచి శుక్రవారం నెల్లూరు, తిరుపతి జిల్లాలకు తాగునీటి అవసరాలకు విడుదల చేశారు. మొదటగా హెడ్‌రెగ్యులేటర్ మూడో వెంట్ ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండలేరు జలాశయంలో 12 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రజల దాహార్తి తీర్చేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కండలేరు నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. నెల్లూరు, తిరుపతి జిల్లాలోని వెంకటగిరి, గూడూరు, రాపూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట ప్రజల నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. సాగు నీటికి వినియోగించరాదని ఆయన సూచించారు.

సారా స్వాధీనం


సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చూపుతున్న పోలీసులు

గుడిపాల: ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. సారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు చేసి, గుడిపాల మండలం చీలాపల్లె వద్ద శుక్రవారం చిత్తూరు మండలం నరిగిపల్లెకు చెందిన సుకుమార్(55) అనే వ్యక్తి ఐదు లీటర్ల సారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అలాగే చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని సియోన్‌మలై వద్ద ఎలక్షన్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పీవై 01 సీప 1800 నంబర్ ఇన్నోవాలో తమిళనాడు నుంచి బొమ్మసముద్రం గ్రామానికి వస్తున్న కారులో 24 బీర్ బాటిళ్లు ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తమిళనాడు రాష్ట్రం వాలాజా తాలుకాకు చెందిన ప్రశాంత్‌శేఖర్(30), గుడిపాల మండలం తమ్మాపల్లె దళితవాడకు చెందిన దీపక్‌రాజ్(31) అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేణిగుంట- నంద్యాల రైలు ప్రారంభం


జెండా ఊపి రేణిగుంట - నంద్యాల రైలును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

రేణిగుంట : రేణిగుంట–నంద్యాల ప్రత్యేక రైలు సరీ్వసును శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట రైల్వే జంక్షన్‌లో గుంతకల్ ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ ప్రారంభించారు. నంద్యాల– కడప వరకు నడుస్తున్న డెమో రైల్వే సర్వీసును రేణిగుంట వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో రాష్ట్రంలో మూడు నూతన రైలు సర్వీసులను ప్రారంభించారు. అందులో భాగంగా రేణిగంట నుంచి ఏడీఆర్‌ఎం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అభ్యర్థన మేరకు స్థానికుల సౌకర్యార్థం నంద్యాల నుంచి కడప వరకు పరిమితమైన రైలు సర్వీసును రేణిగుంట వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ రైలు ప్రతిరోజూ మధ్యాహ్నం 3.45 గంటలకు రేణిగుంట నుంచి బయలుదేరుతుందన్నారు. శ్రీకాళహస్తికి చెందిన డీఆర్‌వో సభ్యుడు మురళీకృష్ణ ప్రయాణికుల సౌకర్యార్థం వీల్‌చైర్లు, టీషర్టులు, రగ్గులు పంపిణీ చేశారు.

650 మందికి మళ్లీ ఉద్యోగాలు హర్షణీయం

తిరుపతి అర్బన్ : క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయిన వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. రోడ్డు ప్రమాదాలతోపాటు క్రమశిక్షణా చర్యల కింద రాష్ట్రంలో రెండేళ్లలో 650 మంది ఉద్యోగాలు కోల్పోయినట్టు పేర్కొన్నారు. వారికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. ఇకపై క్రమశిక్షణ చర్యలకు సంబంధించి సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల నుంచి అప్పీల్‌ను స్వీకరించే అధికారం ఆయా డిపో మేనేజర్లకు ఇచ్చారని తెలిపారు. డిప్యూటీ సీటీఎంలు లేదా డీపీటీఓ స్థాయి అధికారులు అక్కడికక్కడే విచారణ జరిపి వారికి తిరిగి ఉద్యోగాలు ఇచ్చే అధికారాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. గతంలో క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన అన్ని సమస్యలు రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలించాల్సి రావడంతో జాప్యం జరిగేదని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీ ద్వారక తిరుమలరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



అట్టహాసంగా 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడాపోటీలు




ఐరాల: కామినాయనపల్లెలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు, పూతలపట్టు: ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు, వాలీబాల్ విజేత బంగారుపాళెం జట్టు

ఐరాల: యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ నాగరాజు అన్నారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాణిపాకం, పాలకల, కామినాయనపల్లెలో పోటీలను నిర్వహించారు. కామినాయనపల్లెలో నిర్వహించిన మహిళ ఫైనల్ కబడ్డీ పోటీల్లో కాణిపాకం జట్టుపై పాలకల–1 జట్టు విజేతగా నిలిచారు. పాలకలలో పురుషుల ఫైనల్ కబడ్డీ మ్యాచ్‌లో మొరంపల్లె జట్టుపై నాగంవాండ్లపల్లె జట్టు విజయం సాధించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. క్రీడాకారులు లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలని చెప్పారు. యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి రాష్ట్ర స్థాయిలో తగిన గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, పీడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూతలపట్టు: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీడీఓ గౌరి నిర్వహించారు. పురుషుల బ్యాడ్మింటన్ మొదటగా పూతలపట్టు, రెండో స్థానంలో తలపులపల్లి, మూడోస్థానంలో బండపల్లి జట్టుగా నిలిచింది. మహిళల్లో మొదటగా గాండ్లపల్లి, బండపల్లి, పోలవరం విజేతలుగా నిలిచాయి. పురుషుల ఖోఖో పోటీల్లో బండపల్లి, పోలవరం, తేనేపల్లి జట్టు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల ఖోఖో పోటీల్లో బండపల్లి, పేటాగ్రహారం జట్లు విజేతలుగా నిలిచాయి. 17, 18, 19 తేదీల్లో మండల స్థాయి క్రికెట్ పోటీలను పూతలపట్టు, పోలవరం, బైటపల్లి మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గౌరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ద్వారకనాథ రెడ్డి, స్థానిక సర్పంచ్ మాసిలామణి, నాయకులు మణి, షణ్ముగం, బాలాజీ, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్, వాలీబాల్, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బ్యాడ్మింటన్, తగ్గువారిపల్లె క్రీడామైదానంలో కబడ్డీ, ఖోఖో, నల్లగాంపల్లెలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో బంగారుపాళెం బాలుర జట్టు, బాలికల విభాగంలో బోడబండ్ల, కబడ్డీలో తగ్గువారిపల్లె జట్టు, బాలికల విభాగంలో బోడబండ్ల, ఖోఖోలో టేకుమంద బాలుర జట్టు, బాలికల విభాగంలో కూర్మాయిపల్లె జట్టు మండల స్థాయిలో గెలుపొందాయి. బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో బంగారుపాళెం, బాలికల విభాగంలో కూర్మాయిపల్లె జట్టు గెలుపొందాయి. శనివారం క్రికెట్ ఫైనల్ పోటీలు నిర్వహించనున్నారు.

క్రికెట్ విజేత 14 కండ్రిగ ముస్లింవాడ

యాదమరి: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మండల స్థాయిలో ఆడిన క్రికెట్ పోటీల్లో 14 కండ్రిగ ముస్లింవాడ జట్టు గెలుపొందింది. వారికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి కబీర్ బహుమతులు అందించారు.

నేడు కాణిపాకానికి డాక్టర్ సునీల్

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్ శనివారం విచ్చేయ నున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రెండు రోజుల క్రితం పూతలపట్టు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా డాక్టర్ సునీల్‌కు మార్‌ను నియమిస్తూ విజయవాడ పార్టీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో నూతనంగా ఎన్నికైన నియోజక వర్గ ఇన్‌చార్జ్ శనివారం ఉదయం వినాయకుని దర్శించుకోనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు

చిత్తూరు అర్బన్: సంక్రాంతి పర్వదినం నేపథ్యంలో నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకునేది లేదని వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, పూతలపట్టు ఎస్ఐ రాంభూపాల్ అన్నారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఊర్లో వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటిపై నిఘా పెడతామన్నారు. కోడి పందెం, జల్లికట్టుకు అనుమతులు లేవన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎట్టిపరిస్థితుల్లో వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

ఐరాల: నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 35 యర్లంపల్లె పంచాయతీ సర్పంచ్ మల్లీశ్వరి అన్నారు. మండలంలోని 35యర్లంపల్లె సచివాలయం ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య నిపుణులు 190 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వృద్ధులకు కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు, హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. శిబిరంలో పలువురు వృద్ధులు మాట్లాడుతూ ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశామని, వృద్ధుల కోసం ఇంటి ముంగిటకే వైద్యం, పింఛన్ అందిస్తున్నది ఒక్క జగన్ మాత్రమేనని కొనియాడారు. ఆయనకు తమ ఆశీర్వచనాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, స్పెషలిస్టు డాక్టర్లు శిరీష, శారద, వ్యవసాయ సలహా మండలి ఉపాధ్యక్షుడు లోకనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ లత, వైఎస్సార్‌సీపీ నేతలు సుబ్రమణ్యం, రాజేంద్ర, ఈఓపీఆర్డీ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే జగనన్న లక్ష్యం

బంగారుపాళెం: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని ఎంపీపీ అమరావతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తగ్గువారిపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 251 మందికి బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి జబ్బులకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా 28 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష అనే బృహత్తర కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. వైద్య శిబిరంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రజల శ్రేయస్సు, సంక్షేమం గురించి నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ వాణిప్రియ, ఎంపీటీసీ హేమచంద్ర, మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌వెంగల్ రాయన్, నాయకులు రఘుపతిరాజు, సురేంద్ర, ముబారక్, షాకీర్, ఖాదర్, డాక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న ప్రజలు


ఐరాల: వృద్ధురాలికి కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి, పార్టీ నేతలు

మత్స్య సంపదతో ఆర్థికాభివృద్ధి

బంగారుపాళెం: మత్స్యకారులు చేపల పెంపకం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. మండలంలోని గుంతూరు సమీపంలో ఉన్న వెంకటప్పనాయుని చెరువులో శుక్రవారం ఎఫ్‌డీఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏపీ మత్స్యసంస్థచే 40వేల చేపపిల్లలు, పీఎం సమృద్ధి మత్స్య సంస్థ ద్వారా 6,500 చేప పిల్లలను వదిలిపెట్టారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకునేందుకు కృషి చేస్తోందని చెప్పారు. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ద్వారా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మత్స్యకారులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరీ, గంగపుత్ర సహకార సంఘ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజ, ఉమాపతి, ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, సభ్యులు కేశవులు, చంద్రశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

24న తపాలా డాక్‌అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: తపాలసమస్యలపై డివిజన్ స్థాయి డాక్‌అదాలత్ ఈనెల 24న నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ లక్ష్మణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఆ రోజు మధ్యాహ్నం కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమస్యలను ఈనెల 22వ తేదీలోపు తెలియజేయాలని కోరారు.

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: కొత్తపల్లెమిట్ట సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు సెక్షన్లలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. పెనుమూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం సెక్షన్ల పరిధిలో సరఫరా ఉండదన్నారు.

వరసిద్ధునికి రూ.3లక్షల విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి విశాఖపట్నంకు చెందిన వెంకట సత్యనారాయణ రూ.3లక్షలు విరాళాన్ని ఆలయ అధికారులకు అందించారు. ఉదయం దాత కుటుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష, స్వామివారి నిత్యఅన్నదానానికి రూ.లక్ష, గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష కలిపి మొత్తం రూ.3లక్షలు అందించారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు ఉన్నారు.


విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

ఎరువుల దుకాణాలు తనిఖీ

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం సాయంత్రం వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. డీఆర్‌సీ ఏఓ లక్ష్మీప్రసన్న పలు దుకాణాల్లో రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ, దుకాణ యజమానులు రైతులకు నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యమైన ఎరువులు, మందులను మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. నిబంధనల మేరకు నడుచుకోని దుకాణ నిర్వాహకుల లైసెన్సులను రద్దు చేసామన్నారు. ఏఓలు భారతి, చిట్టిబాబు, ఏఈఓ సాదరయ్య తదితరులు పాల్గొన్నారు.


దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న లక్ష్మీప్రసన్న

యువతకు ఆదర్శం స్వామి వివేకానంద

గుడిపాల: యువతకు ఆదర్శం స్వామి వివేకానంద అని సీఎస్ఆర్ కళాశాల కరస్పాండెంట్ లోకేష్ అన్నారు. స్వామి వివేకానంద 160వ జయంతి సందర్భంగా సీఎస్ఆర్ కళాశాలలో శుక్రవారం కళాశాల విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతకు ఆదర్శం వివేకానంద అన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి దాని ద్వారా భారత యువతకు దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడుతూ పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టుగా చిన్నప్పటినుంచే స్వామి వివేకానందకు నిస్వార్థగుణం, ఔదార్య గుణాలు అలవడ్డాయన్నారు. అనంతరం కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అర్జున్, అధ్యాపకులు వలంటీర్లు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్ర